రహదారులు జలమయం

- వానతో తడిసి ముద్దయిన నగరం
- పొంగి పొర్లిన కాలువలు



మున్సిపల్ కాలనీలో మ్యాన్‌హోల్ వద్ద ఇలా..



రామకృష్ణ జంక్షన్‌లో ఎగసిపడుతున్న అండర్ గ్రౌండ్ వాటర్



రామకృష్ణ జంక్షన్‌లో నిలిచిన నీరు

అల్లిపురం: నగరంలో సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో నగరంలో కాలువలు, గెడ్డలు పొంగి పొర్లాయి. వర్షపునీటితో రోడ్లు జలమయమయ్యాయి. నియోజకవర్గంలోని డాబాగార్డెన్స్, సరస్వతి జంక్షన్, రామకృష్ణ జంక్షన్, చావులమదుం, రైల్వే స్టేషన్ ప్రాంతంలో రోడ్లు జలమయమయ్యాయి. భారీ వర్షానికి మ్యాన్ హోల్స్ నుంచి వర్షపు నీరు ఉబకటంతో, మూతలు పైకి లేచాయి. వాటిని అదుపు చేసేందుకు స్థానికులు స్థాపర్లను వాటిపై పెట్టినా ఫలితం లేకపోయింది. వర్షపు నీటిలో వాహనాలు రెండడుగుల మేర నిలిచిపోవటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

క్లుప్తంగా

మహిళలకు చీరలు పంపిణీ



మహిళకు చీర అందజేస్తున్న శ్రీవత్సవ్

డాబాగార్డెన్స్: స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో పేద మహిళలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ చీరలు పంపిణీ చేశారు. కొన్నేళ్లుగా సంస్థలో ఆశ్రయం పొంది అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన మజ్జి కాంతం చిత్రపటానికి సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, పైడిరాజు, ముత్యాలరావు, లక్ష్మణరావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని పోర్టు కార్మికుల ధర్నా



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గంగవరం పోర్టు అఖిలపక్ష నాయకులు

మహారాణిపేట : కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గంగవరం పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్మికులకు కనీస వేతనం రూ.36 వేలు ఇవ్వాలని, అక్రమంగా తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.పైడిరాజు, కొండయ్య, మహ్మద్ నజీర్, దుమ్మెట అప్పారావు, శీతమదన్, వై.కొండయ్య, సోడదాసు సుధాకర్, వి.కృష్ణారావు, బి.జగన్ పాల్గొన్నారు.

3న జోన్-3లో బహిరంగ వేలం

సీతంపేట: జీవీఎంసీ జోన్-3 పరిధిలో ఖాళీగా ఉన్న దుకాణాలు, కల్యాణ మండపాలకు ఆగస్టు 3వ తేదీ ఉదయం 11 గంటలకు ఆశీలుమెట్ట జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ దొండపర్తి కల్యాణ మండపం, డైమండ్ పార్కు వాణిజ్య సముదాయంలోని మొదటి అంతస్తులో గల దుకాణాల నంబర్లు 8, 9, ఆశీలుమెట్ట వాణిజ్య సముదాయంలోని దుకాణం నంబర్ 3, ఎంవీపీ వాణిజ్య సముదాయంలోని 7, 10, 13, 14 నంబరు దుకాణాలు, జగ్గారావు బ్రిడ్జి వద్ద వాణిజ్య సముదాయంలోని దుకాణం నంబరు 6(పీహెచ్ కోటా), సీతమ్మధార పాత వాణిజ్య సముదాయంలోని 15 నంబర్ దుకాణం(ఎస్సీ)కు బహిరంగ వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు వేలంలో పాల్గొనాలని జెడ్సీ కోరారు. వివరాలకు జీవీఎంసీ జోన్-3 కార్యాలయ పనివేళల్లో సూపరింటెండెంట్‌ను సంప్రదించాలని చెప్పారు.

టిడ్కో లబ్ధిదారులకు రుణాల మంజూరుకు కృషి



టిడ్కో ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సాధిక్

జగదాంబ: టిడ్కో ఇళ్లు మంజూరైనా రుణాలు రాని లబ్ధిదారులకు రుణాలు వచ్చే విధంగా కృషి చేస్తానని జీవీఎంసీ 39వ వార్డు కార్పొరేటర్ ముహమ్మద్ సాధిక్ అన్నారు. వార్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులతో సాధిక్ సోమవారం మాట్లాడారు. బ్యాంకుల్లో ట్రాక్ బాగాలేదంటూ ఇప్పటి వరకు రుణాలు రాని లబ్ధిదారులకు కూడా రుణాలు వచ్చేలా కృషి చేస్తామన్నారు. వార్డులో ఎంతమంది ఉన్నారో జాబితా తయారు చేయాలని సూచించారు. లోన్లు అయిన వారందరికీ రిజిస్ట్రేషన్లు కూడా పూర్తి చేస్తామని తెలియజేశారు.

ఘనంగా 'అయ్యంకి' జయంతి



అయ్యంకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి పోలితల్లి,ఎల్లారావు

డాబాగార్డెన్స్: గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య 133వ జయంతిని 36వ వార్డు రంగిరీజువీధిలోని బాలల శాఖా గ్రంథాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ సీనియర్ పాఠకుడు ఎస్.ఎల్లారావు అయ్యంకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి టి.పోలితల్లి మాట్లాడుతూ వెంకటరమణయ్య ఆయుర్వేదం, సిద్ధవైద్యంలో ఎంతో పేరుగాంచారన్నారు. 1934-48 మధ్య కాలంలో ఉత్తరాంధ్రలో అనేక గ్రంథాలయాలు స్థాపించారన్నారు. గ్రంథాలయాల విస్తరణకు, అభివృద్ధికి అయ్యంకి చేసిన కార్యక్రమాలు, జీవిత విశేషాలను వివరించారు. 1972లో పద్మశ్రీ అవార్డు అందుకున్నారని చెప్పారు. ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.

త్వరితగతిన వినతుల పరిష్కారం



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: ప్రజా వినతులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ ఆదేశించారు. జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 04 అర్జీలు అందాయి. ప్రజల వాటిని జెడ్సీ స్వీకరించి సంబంధిత అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్‌కు 02, యూసీడీ విభాగానికి 02 చొప్పున వినతులు అందినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్-1 టి.ఎస్.ఎన్.రాజు, సూపరింటెండెంట్-2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ శ్రీనివాసరావు, టి.ప్రసన్నరెడ్డి, వాటర్ వర్క్స్ ఈఈ-2 సూరిశెట్టి శేఖర్, డీఈ శ్రీనివాసవర్మ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ రఘునాథ్, టీపీవో శ్రీలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, సూపర్‌వైజర్ జనార్దన్, టీపీఆర్‌వో ఏపీడీలు చిరంజీవి, పద్మావతి, సచివాలయ అడ్మిన్లు పాల్గొన్నారు.

మణిపూర్‌లో మహిళలకు రక్షణ కల్పించాలి



ర్యాలీగా వస్తున్న పలు సంఘాల నాయకులు

సీతమ్మధార: మణిపూర్‌లో మహిళలకు రక్షణ కల్పించాలని విద్యార్థి, మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఎస్‌ఎఫ్‌ఐడబ్ల్యూ, ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మహిళా కళాశాల నుంచి ఎల్‌ఐసీ భవనం మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ హింసాకాండపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంటే తప్ప, ప్రధాని మోదీ మౌనం వీడకపోవడంపై అనుమానాలు వస్తున్నాయన్నారు. నేరస్తులను శిక్షించి మణిపూర్‌లో శాంతి నెలకొల్పేంత వరకు వివిధ రూపాల్లో పోరాటాలు సాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు ఎ.విమల, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.అచ్యుతరావు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు, శేఖర్, సింహాచలం, ఎం.ఎ.బేగం, పద్మ, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

మణిపూర్ మారణకాండను ఆపాలి

మహారాణిపేట: మణిపూర్ ఆదివాసీ మహిళలపై సామూహిక అత్యాచారాలు, హింసాకాండకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఇంటర్నేషనల్ దళిత జర్నలిస్టుల నెట్‌వర్క్ (ఐడీజేఎన్)ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి పంపే నిమిత్తం స్పందన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఐడీజేఎన్ రాష్ట్ర అధ్యక్షుడు తంగేటి నానాజీ మాట్లాడుతూ దేశం మొత్తం తలదించుకునే విధంగా మణిపూర్‌లోని కుకీ తెగ ఆదివాసీ మహిళలపై లైంగిక అత్యాచారాలు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.సత్యనారాయణ, కె .చంద్రమోహన్, టి.బంటయ్య, కోన ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

300 మంది కళాకారులతో నేడు ప్రదర్శన



కళాబృందాల పోస్టర్ విడుదల చేస్తున్న సంఘం సభ్యులు

తగరపువలస: నవ చైతన్య కళానాట్యమండలి 19వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం చిట్టివలస శ్రీలక్ష్మి శ్రీనివాస కల్యాణ మండపంలో 300 మంది కళాకారులతో ప్రదర్శనలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి సోమవారం మండలి ఆహ్వాన సంఘం పోస్టర్లు, కరపత్రాలను గాంధీ బొమ్మ వీధిలోని కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆహ్వాన సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ మధ్యాహ్నం 3 గంటల నుంచి ఓ గంట పాటు బంగ్లామెట్ట శివాలయం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు కళాకారులతో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. తర్వాత 4 గంటల నుంచి 9 వరకు కల్యాణ మండపంలో జానపద నృత్యాలు, క్లాసికల్ డ్యాన్సులు, రేలారే రేల పాటలు, ఫోక్ డ్యాన్సుల ప్రదర్శనలు ఉంటాయన్నారు. వీటిని భీమిలి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆహ్వాన సంఘం ప్రతినిధి సరగడ చినరెడ్డి, అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, ఉపాధ్యక్షుడు తమ్మిన రామలక్ష్మణరావు, ఆర్గనైజర్ బైపిల్లి సూర్యనారాయణ, సహాయ కార్యదర్శులు కోసూరి రాంబాబు, నీలకంఠం, కోశాధికారి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

యూని ఎక్స్‌పర్ట్స్

గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ నేడు

అల్లిపురం: విదేశీ విద్యను అభ్యసించాలనుకునే వారికి యూని ఎక్స్‌పర్ట్స్ సంస్థ అవకాశం కల్పిస్తుందని ఆ సంస్థ వైజాగ్ బ్రాంచ్ మేనేజర్ అనిత కొమ్మరాజు తెలిపారు. దీనిపై నగరంలోని ఫార్చ్యూన్ శ్రీ కన్య హోటల్‌లో మంగళవారం గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డాబాగార్డెన్స్‌లోని సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో 30కి పైగా అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు పాల్గొంటాయన్నారు. పూర్తి వివరాలకు 77859 68968 నంబర్లో సంప్రదించాలని కోరారు. సమావేశంలో బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రావాడ నాయుడు, శారన్ సైదా, రేఖ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలకు డిమాండ్

డాబాగార్డెన్స్: భూ కబ్జాలకు పాల్పడతున్న పాత నేరస్తులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని బి.శ్రీధర్‌రెడ్డి కోరారు. నగరంలోని డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత నేరస్తులు యర్రా ఈశ్వరరావు, రాజమండ్రికి చెందిన పద్మకుమారి కలిసి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి పలువురి భూములు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. పద్మకుమారిపై ఇప్పటికే రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్టు తెలిపారు. సమావేశంలో బాబూరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

జ్యూట్‌మిల్లు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మహారాణిపేట : చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు దల్లి అప్పలరెడ్డి మాట్లాడుతూ కార్మికులకు పీఎఫ్ నగదు, వెయ్యి రూపాయల పింఛన్ చెల్లించాలని కోరారు. జ్యూట్ మిల్లులో పనిచేసిన కార్మికుల కష్టార్జితంతో కూడిన పీఎఫ్‌ను తక్షణమే ఇప్పించాలని డిమాండ్ చేశారు.

వ్యక్తి ప్రగతికి కార్యనిర్వాహక నైపుణ్యాలు కీలకం



కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌డీవో పూర్వ డైరెక్టర్ జనరల్ వరప్రసాద్, తదితరులు

ఏయూ క్యాంపస్: సంస్థలో వ్యక్తి ప్రగతికి కార్యనిర్వాహక నైపుణ్యాలు కీలకంగా నిలుస్తాయని డీఆర్‌డీవో పూర్వ డైరెక్టర్ జనరల్(హెచ్‌ఆర్) కె.ఎస్.వరప్రసాద్ అన్నారు. సోమవారం ఐఐఎం విశాఖపట్నం ఏయూ ప్రాంగణంలో డీఆర్‌డీవో శాస్త్రవేత్తలకు 'ప్రాజెక్ట్ అన్‌సెర్చినిటీ-రిస్క్ మేనేజ్‌మెంట్ అంశంపై'ఐదు రోజుల పాటు జరిగే సామర్థ్యాల నిర్వహణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం వరప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో ప్రాజెక్టుల నిర్వహణ, పూర్తి చేయడం ఎంతో అవసరమన్నారు. విభిన్న సంస్థలు, విభాగాలతో అనుసంధానంగా పని చేయడం, మానవ వనరుల సమర్థ నిర్వహణను వివరించారు. భవిష్యత్తులో ఆటోమేషన్ ఏఐ సాంకేతికతలు ప్రముఖ భూమిక పోషిస్తాయని, సాంకేతికత విస్తృతిని ముమ్ముందుగా అంచనా వేస్తూ సాగాలన్నారు. అదే విధంగా ఎస్‌ఏడీకి చెందిన ఐఏఎస్ అధికారులకు ఆరు రోజుల ఇండక్షన్ ప్రోగ్రాంని ప్రారంభించారు. ఆచార్య బి.శ్రీరంగాచార్యులు డీఆర్‌డీవో శాస్త్రవేత్తల శిక్షణ కార్యక్రమం వివరాలు తెలియజేశారు. అడ్మినిస్ట్రేషన్ డీన్ ఆచార్య ఎం.వి.అనూరాధ, ఆచార్య రోహిత్ తిత్యాల్, ఆచార్య బాలాజి సుబ్రహ్మణియన్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం



కార్యక్రమం ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ వెంకటరావు

కొమ్మాది: రుషికొండలో గల గాయత్రి విద్యా పరిషత్ కళాశాలలో డిగ్రీ, పీజీ కోర్సు, కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్ ఛాలెంజర్స్ అండ్ టెండర్స్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. 5 రోజులపాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ కె.వెంకటరావు ప్రారంభించారు. ప్రస్తుత కాలంలో జరుగుతున్న ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు డి.దక్షిణామూర్తి, కార్యదర్శి ప్రొఫెసర్ పి.సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణ సామాజిక బాధ్యత



తన బంగ్లా నుంచి జీవీఎంసీ కార్యాలయానికి సైకిల్‌పై వస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ



బస్సులో జీవీఎంసీకి చేరుకున్న మేయర్

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణ మన సామాజిక బాధ్యతని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ సోమవారం తమ సొంత వాహనం వదలి ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించి క్యాంపు కార్యాలయం నుంచి జీవీఎంసీకి వచ్చారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీకి చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో ఇద్దరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో వాయు, శబ్ద కాలుష్యం పెరిగిపోయిందని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నగరంలో ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల యాజమాన్యాలు వారి సిబ్బందితో వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను ఉపయోగించేలా చూడాలన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా సాధ్యమైనంత వరకు విద్యుత్ వాహనాలు ఉపయోగించాలని కోరారు.

శ్రీ ఆంజనేయ స్వామి ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులతో ఈవో అల్లు జగన్నాథం, ఎమ్మెల్యే వాసుపల్లి

మహారాణిపేట : పాతనగరం మెయిన్ రోడ్డులోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం ధర్మకర్తల మండలి పదవీ ప్రమాణ స్వీకారం సోమవారం వైభవంగా సాగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేవాలయ కార్యనిర్వహణాధికారి అల్లు జగన్నాథం సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ధర్మకర్తల మండలి చైర్మన్‌గా వడ్డాది దిలీప్ కుమార్‌ను సభ్యులు ఎన్నుకున్నారు. సభ్యులుగా అడపా శివ, బత్తుల రాము, గుత్తి రత్నం, యలమంచలి సంతోష్ కుమార్, బోను కల్యాణి, పొన్నాడ శారద, ఎక్స్‌ఆఫీషియో సభ్యునిగా ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస్ శర్మ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు దశమంతుల మాణిక్యాలరావు, వార్డు ఇన్‌చార్జి పెంటపల్లి సత్యనారాయణ, శ్రీకనక మహాలక్ష్మి ధర్మకర్తల మండలి చైర్పర్సన్ కొల్లి సింహాచలం, శ్రీ నీలమ్మవేప చెట్టు ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి, 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్ కుమార్ జైన్, జేసీఎస్ ఇన్‌చార్జి పీతల వాసు, 36వ వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు, 35వ వార్డు అధ్యక్షుడు అలుపన కనక రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బంగారమ్మ తొలేళ్ల ఉత్సవం



వీధుల్లో పూలజంగడి ప్రదర్శన నిర్వహిస్తున్న భక్తులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 29వ వార్డు దిబ్బలపాలెం, చందకవీధి, పీ అండ్ టీ క్వార్టర్స్ గ్రామదేవత బంగారమ్మ పండగ మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం తొలేళ్ల పండగ నిర్వహించారు. ఉదయం 9 గంటలకు వీధుల్లో పూలఘటాలు తిరిగాయి. సాయంత్రం బంగారమ్మకు సారె సమర్పించారు. రాత్రి 7 గంటలకు వీధుల్లో కూటి ఘటాలు తిప్పారు. కళావేదిక ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రధాన పండగ, అనుపు కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ చందక అప్పలరాజు తెలిపారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, పూలఘటాలు, కూటిఘటాల ఊరేగింపు ఉంటుందన్నారు. అనుపు సందర్భంగా సాయంత్రం 4 గంటల నుంచి అమ్మవారి ప్రభల ఊరేగింపు ఉంటుందని తెలియజేశారు.

వార్డులో సమస్యల పరిష్కారానికి చర్యలు



కోటవీధిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ సాధిక్

జగదాంబ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయని 39వ వార్డు కార్పొరేటర్ ముహమ్మద్ సాధిక్ అన్నారు. వార్డులోని కోటవీధి, పెద్దివీధి, మౌలాలి పంజా, థామ్సన్ వీధి, అబుసరంగ్ వీధుల్లో సోమవారం ఆయన పర్యటించారు. సాధిక్ మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఎక్కడి సమస్యలు అక్కడే ఉండిపోయాయన్నారు. దీనివలన ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. వార్డులో ఇప్పటికే వైఎస్సార్‌సీపీ ద్వారా కోటవీధిలో కాలువలు నిర్మాణం, పంజావీధిలో రహదారి నిర్మాణం చేశామన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ , వీధిలైట్ల సమస్యలు కూడా త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కార్పొరేటర్ నిధులతో కాల్వల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పెద్దిరోడ్డులో కాలువలు, డ్రైన్లు మరమ్మతులు చేస్తామన్నారు. శానిటరీ పనులు చేయించాలని ప్రజలు కోరడంతో సాధిక్ వెంటనే ఆయా శాఖల అధికారులతో మాట్లాడి పనులు చేసేలా చర్యలు తీసుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు చల్లపల్లి శ్రావణి నృత్య ప్రదర్శన



చల్లపల్లి శ్రావణి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం ప్రవాస భారతీయురాలు చల్లపల్లి శ్రావణి నృత్య ప్రదర్శన నిర్వహించనున్నట్టు ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు తెలిపారు. సోమవారం ఉదయం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికాలో స్థిరపడిన శ్రావణి చిన్నతనం నుంచి కళలపై ఆసక్తితో కూచిపూడి నృత్యాన్ని అభ్యసించారన్నారు. డీసీఎంఎస్ విభాగంలో ఉదయం 11 నుంచి రెండు గంటల పాటు శ్రావణి నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు. నృత్య కళాకారిణి శ్రావణి మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన ఏయూలో నృత్య ప్రదర్శన ఇవ్వడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. గణేష పంచరత్నం, కామాక్షి స్తుతి, బ్రహ్మకడిగిన పాదం , శివతాండవ స్తోత్రం, జావళి ప్రదర్శిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య చల్లా రామకృష్ణ, ఆచార్య సి.ఎస్.రావు, విజయవేణి, రాజశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మూడు కార్లు ధ్వంసం

పీఎం పాలెం: ఎండాడ ట్రాఫిక్ కూడలి వద్ద సోమవారం ఆగి ఉన్న కారును ఓ ప్రైవేటు బస్సు ఢీకొన్న ఘటనలో మూడు కార్లు ధ్వంసమయ్యాయి. ఇందుకు సంబంధించి పీఎం పాలెం ట్రాఫిక్ పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆనందపురం వైపు నుంచి జాతీయ రహదారిపై వస్తున్న కారు ఎండాడ సిగ్నల్ పాయింట్ వద్దకు వచ్చే సరికి స్లోగా ఆగింది. అదే రోడ్డులో వెనుక వస్తున్న ప్రైవేటు బస్సు ఆ కారును వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఈ ఘటనలో ఆ కారు ఢీకొని మరో రెండు కార్లకు కూడా డ్యామేజ్ అయింది. ప్రయాణికులు అందరూ సురక్షితంగా ఉన్నారని పోలీసులు తెలిపారు.